క్లుప్తంగా

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



అవగాహన కల్పిస్తున్న ఆకుల రజిత

హుస్నాబాద్: సంపూర్ణ ఆరోగ్యం కోసం విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో బుధవారం సఫాయి అప్నా బీమారి భగావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భోజనం చేయకముందు, చేసిన తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, హెచ్‌ఎం వెంకటయ్య, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం

మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్



నర్సింహులును సన్మానిస్తున్న కమిషనర్ రమేశ్

దుబ్బాకటౌన్: ప్రతీ ఉద్యోగికి బదిలీలు సహజమని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ కల్యాణం రమేష్ కుమార్ అన్నారు. దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న నర్సింహులు సిద్దిపేట మున్సిపల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. బుధవారం దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యుడు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీనివాస్, బాలకృష్ణ గౌడ్, కోఆప్షన్ సభ్యుడు స్వామి, నాయకులు భూంరెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

ఆత్మకమిటీ చైర్మన్ ప్రభాకర్ వర్మ



విత్తన బంతులను విసురుతున్న ఆత్మకమిటీ చైర్మన్ ప్రభాకర్ వర్మ

సిద్దిపేటరూరల్: భవిష్యత్తు తరాల కోసం ప్రతీ ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సిద్దిపేట ఆత్మ కమిటీ చైర్మన్, నవ సమాజ నిర్మాణ జాతీయ అధ్యక్షుడు లక్కరసు ప్రభాకర్ వర్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రావురూకుల గ్రామంలో విత్తన బంతులను వెదజల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి ప్రేమికులు, విద్యార్థులతో తయారు చేసిన విత్తన బంతులను అటవీ ప్రాంతాలు, వ్యవసాయ బావుల వద్ద, రోడ్ల పక్కన వెదజల్లితే కాలుష్యం తగ్గడంతో పాటు పశుపక్షాదులకు ఆహారం లభిస్తుందన్నారు. ప్రకృతిని కాపాడటంలో తన వంతుగా ఎనిమిదేళ్లుగా విత్తన బంతులను చల్లుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లైఫ్ ఎన్జీఓ బాలప్రసాద్, మాజీ కౌన్సిలర్ ఐలయ్య, లింగాయత్ సమాజం జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, రాము, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవే లక్ష్యం

రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి



మాట్లాడుతున్న శరత్ చౌదరి

ములుగు(గజ్వేల్): సమాజ అభివృద్ధికి రోటరీ క్లబ్ సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని రోటరీ 3150 జిల్లా గవర్నర్ శరత్ చౌదరి కాట్రగడ్డ అన్నారు. ములుగులో మంగళవారం రాత్రి నిర్వహించిన గజ్వేల్ రోటరీ క్లబ్ 15వ వార్షికోత్సవ నూతన కార్యవర్గ సమావేశానికి హాజరై ప్రసంగించారు. ప్రజాసేవ చేసేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. సామాజిక సేవే లక్ష్యంగా రోటరీ క్లబ్ కృషి చేస్తుందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి మరిన్ని కార్యక్రమాలను చేపట్టి గజ్వేల్ రోటరీ క్లబ్ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సామల నర్సింహారెడ్డి, సెక్రటరీగా మహాదేవుని శ్రీనివాస్‌గౌడ్, ట్రెజరర్‌గా సాయిరెడ్డి, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు సామల వేణు, బాబుగౌడ్, మురళీధర్‌రెడ్డి, అంజిరెడ్డి, జుబేర్‌పాషా, రమణ, చంటి, కరుణాకర్‌రెడ్డి, జగదీశ్వర్, బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో విద్యార్థినులు



బస్వాపూర్‌లో బోనాల ఊరేగింపు

ఘనంగా బోనాల ఉత్సవాలు

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని కేరళ హైస్కూల్‌లో బుధవారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శక్తిమాత, పోతరాజు వేషధారణలో అలరించారు. ఆషాఢ మాసం పురస్కరించుకొని విద్యార్థినులు బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయాలకు వెళ్లి బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బుర్ర రాజేందర్, కరస్పాండెంట్ శైలేందర్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్వాపూర్ గ్రామంలో..

కోహెడ రూరల్(హుస్నాబాద్): మండలంలోని బస్వాపూర్ గ్రామంలో బుధవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో పోచమ్మ ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఉత్సవాలను తిలకించేందుకు భారీగా భక్తులు తరలి వచ్చారు. గ్రామ పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు కొక్కుల రమేష్, భూమయ్య, మల్లికార్జున్, నరేష్, బాలరాజు, సంతోష్, శ్రీపాల్, శంకర్ పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి రుణాలు

మెప్మా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ హన్మంత రెడ్డి



మాట్లాడుతున్న హన్మంత రెడ్డి

హుస్నాబాద్: వ్యాపార పరంగా అభివృద్ధి చెందేందుకు మహిళలకు రుణాలు అందజేస్తామని మెప్మా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ హన్మంత రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆకుల రజిత, కమిషనర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో బుధవారం మెప్మా మహిళా శక్తి అమలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి మెప్మా స్లమ్ సమాఖ్య ప్రతినిధులు, రిసోర్స్‌పర్సన్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా హన్మంత రెడ్డి మాట్లాడుతూ వ్యాపారపరంగా అభివృద్ధి చెందేందుకు బ్యాంక్‌లు, స్త్రీ నిధి నుంచి రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నాయన్నారు. మహిళలు ఉపాధితోపాటు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు మెప్మా ముఖ్యపాత్ర వహిస్తుందని తెలిపారు. మహిళలు తమ సమాఖ్యలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్‌పై తీసుకున్న రుణాలకు 35 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా కోఆర్డినేటర్ ముత్యాల రాజు పాల్గొన్నరు.

పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే హక్కు లేదు

- పార్టీ కోసం కష్టపడ్డ వారికి గుర్తింపు
- చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న డీఎంఓ నాగరాజు

చేర్యాల(సిద్దిపేట): పార్టీ ఫిరాయింపులను కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి ప్రోత్సహిస్తున్నారని ఆరోపించే కేసీఆర్, కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులకు మాట్లాడే నైతిక హక్కు లేదని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో జరిగిన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత, వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు కేసీఆర్, కేటీఆర్‌లకు లేదన్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది బీఆర్ఎస్ పార్టీయే అన్నారు. కుటుంబ పాలనతో విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కొనసాగుతున్న ప్రజాపాలనకు ఆకర్షితులైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరుతుండటంతో భయంతో కేసీఆర్, కేటీఆర్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. గడిచిన ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజల ఓట్లతో గెలిచింది తానేనని, ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్న వ్యక్తి దొంగ ఓట్లతో గెలిచాడని ఆరోపించారు. దొంగ ఓట్లపై చర్చకు తాను సిద్ధమన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి గ్యాదరి పరమేశ్వర్, ఏడీఏ తక్కోలు రాధిక, ఏఓ ఆఫ్రోజ్, కౌన్సిలర్లు చెవిటి లింగం, ఆడెపు నరేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగానికి నిధులు కేటాయించాలి

డీఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి రవిబాబు



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

దుబ్బాక: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రోల్ల రవిబాబు అన్నారు. దుబ్బాకలో చేనేత సహకార సంఘం కార్యాలయాన్ని సందర్శించి నేత కార్మికుల పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేనేత రంగాన్ని నిర్లక్ష్యం చేయడంతో కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. చేనేతలు తయారుచేసిన వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. రూ.30 లక్షల ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సురేష్, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల బోనాలు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి రజక సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ, ఎల్లమ్మ బోనాల ఉత్సవం నిర్వహించారు. మహిళలు బోనాలతో అమ్మవార్ల ఆలయాలకు వెళ్లారు. బోనాలను నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. ఐదేళ్లకు ఒకసారి బోనాల ఉత్సవం నిర్వహిస్తామని సంఘం సభ్యులు తెలిపారు. పోచమ్మ, ఎల్లమ్మ బోనాల తర్వాత మడేలయ్యకు బోనాల ఉత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.



ఆలయానికి వెళ్తున్న రజక సంఘం మహిళలు

మహిళలకు అండగా ఉండాలి

కలెక్టర్ మను చౌదరి



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటకమాన్: బాధితులకు అండగా ఉండేలా సిబ్బంది విధులు నిర్వహించాలని కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. సిద్దిపేట రూరల్ పోలీసు స్టేషన్ ఆవరణలోని సఖీ, భరోసా సెంటర్లను కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ హింసకు గురైన వారు సఖి కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. ఉమెన్ హెల్ప్ లైన్ నంబర్ 181పై ప్రచారం చేయాలని కేంద్రం అడ్మినిస్ట్రేటర్ ప్రతిమను ఆదేశించారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

సిద్దిపేటరూరల్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించకపోవడం అన్యాయమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. బుధవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి బడ్జెట్ కేటాయించకపోవడం సరికాదన్నారు. బడ్జెట్ కేటాయింపు విషయంలో బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు స్పందించకపోవడం విడ్డూరమన్నారు. కేంద్రం నుంచి నిధులు తెస్తానని చెప్పిన రఘునందన్‌రావు కేంద్ర బడ్జెట్ సమతుల్య బడ్జెట్ అంటూ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలకృష్ణ, జిల్లా నాయకుడు ఎల్లారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సంతోష్, మాజీ సర్పంచ్‌లు ఆంజనేయులు, పర్శ రాములు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలో నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని జెడ్పీ సీఈఓ రమేష్ అన్నారు. బెజ్జంకి మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈజీఎస్‌లో గ్రామాల్లో మొక్కలు నాటించాలన్నారు. మండలానికి ఇచ్చిన అంచనాలను గ్రామాలవారీగా గుర్తించి శనివారంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. డీఎల్‌పీఓ వెంకటేశ్వర్ రావు, ఎంపీడీఓ లక్ష్మప్ప, ఏపీఓ రాజబాబు, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రమేష్

కేంద్రం వివక్షపై ఆగ్రహ జ్వాల

వేర్వేరుచోట్ల నిరసనలు



రామవరంలో మాట్లాడుతున్న మల్లికార్జున్ రెడ్డి

గజ్వేల్‌రూరల్: బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఊసెత్తకపోవడం సరికాదని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కుంట్ల లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రధానమంత్రి తన కుర్చీని కాపాడుకోవడానికే ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యతనిచ్చి ఇండియా కూటమి అధికారంలో ఉన్న రాష్ట్రాలను విస్మరించడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. తెలంగాణపై అక్కసుతోనే బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని, దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ ఎంపీలు తమ పదవులకు రాజీనామాలు చేయాలన్నారు.

తెలంగాణ రాష్ట్రానికి నిరాశే

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిరాశే మిగిలిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన నాయకుడు రడం కిరణ్‌కుమార్‌రావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించలేకపోవడం దారుణమన్నారు. కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి నిధులు కేటాయించే విధంగా కృషి చేయాలన్నారు. రాష్ట్రానికి న్యాయం జరిగేలా ఎంపీలు కృషిచేయాలని డిమాండ్ చేశారు.

రామవరం గ్రామంలో..

అక్కన్నపేట(హుస్నాబాద్): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 8 పైసలు కూడా రాలేదని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామవరం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి ఒక రూపాయి కూడా కేటాయించకపోవడం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసే విధంగా ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి స్పీకర్ అనుమతితో కేంద్ర బడ్జెట్‌పై తీర్మానం చేస్తామంటూ కొత్త నాటకానికి తెరలేపారని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ లింగాల సాయిన్న, మాజీ సర్పంచ్ గద్దల రమేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ విద్యార్థులకు సన్మానం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గోనెపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వారిని గ్రామానికి చెందిన అనంతోజు అమర్ బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగితే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు.

◆ కూలిన ఇల్లు

దుబ్బాక: ఐదు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షానికి పట్టణంలోని 13వ వార్డు ఎస్సీ కాలనీలో ఎడ్ల లింగవ్వకు చెందిన పెంకుటిల్లు బుధవారం కూలిపోయింది. సుమారుగా రూ.లక్షకు పైగా ఆస్తి నష్టం సంభవించిందని బాధితురాలు తెలిపింది. బాధితురాలికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కాలని వాసులు విజ్ఞప్తి చేశారు.

◆ మృతుడి కుటుంబానికి పరామర్శ

తొగుట(దుబ్బాక): మండలంలోని లింగాపూర్‌లో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న చేపూరి ఆంజనేయులు గౌడ్ కుటుంబాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంజనేయులు గౌడ్ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. మృతుడి కుటుంబ పరిస్థితిని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి వివరిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీశైలం, అశోక్, సంతోష్, స్వామిగౌడ్, రాంబాబు ఉన్నారు.

◆ గిర్మాపూర్‌లో హెల్త్ సర్వే

వర్గల్(గజ్వేల్): మండలంలోని గిర్మాపూర్‌లో బుధవారం వైద్యాధికారి డాక్టర్ హరిత, ఎంపీడీఓ విజయలక్ష్మి ఇంటింటికి వెళ్లి హెల్త్ సర్వే జరిపారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. అస్వస్థతకు గురైన బాలుడిని పరీక్షించి మందులు సిఫార్సు చేశారు. ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే గ్రామంలోని ఆశా వర్కర్, అంగన్‌వాడీ టీచర్‌కు సమాచారమివ్వాలని సూచించారు.

◆ సర్వేయర్లను నియమించండి

హుస్నాబాద్: అక్కన్నపేట మండలానికి సర్వేయర్లు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే సర్వేయర్లను నియమించాలని హుస్నాబాద్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం గౌరవ అధ్యక్షుడు పెండ్యాల అయిలయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు. ఏళ్లు గడుస్తున్నా రైతుల భూములకు హద్దులు ఏర్పాటు చేయడం లేదన్నారు.

◆ లెక్చరర్లకు ఘనంగా వీడ్కోలు

వర్గల్(గజ్వేల్): వర్గల్ పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాల హిస్టరీ, తెలుగు లెక్చరర్లు సీహెచ్ సునీత, జ్యోతిరాణి బదిలీ అయ్యారు. బుధవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు అధ్యక్షతన వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఇరువురిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ ప్రభుత్వ భూమిని పేదలకు ఇవ్వాలి

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో 1985లో వంద మంది పేదలకు పంపిణీ చేసిన స్థలాలను కొందరు కబ్జా చేసి పట్టా మార్పిడి చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ రామూర్తికి డీఎస్పీ నాయకులు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు చెంచల ఎల్లయ్య మాట్లాడారు. ప్రభుత్వం పేదలకు స్థలాలను పంపిణీ చేసిందన్నారు. ఆ భూములకు ధరలు పెరగడంతో కొందరు కబ్జా చేసి అక్రమంగా పట్టాలు మార్పిడి చేసుకున్నారని ఆరోపించారు. అక్రమంగా చేసుకున్న పట్టాలను రద్దు చేసి ఆ భూములను పేదలకు ఇవ్వాలని కోరారు.

◆ మెస్ చార్జీలు పెంచాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వసతి గృహాల విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మధు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పలు వసతి గృహాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థికి రోజుకు రూ.33 మెస్ చార్జీ సరిపోవడం లేదన్నారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రవి, వినయ్, మహేష్ ,శ్రావణ్ పాల్గొన్నారు.

◆ విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని గజ్వేల్ సీఐ సైదా హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల మోడల్‌స్కూల్‌లో ట్రాఫిక్ సీఐ మురళితో కలిసి మహిళల రక్షణ చట్టాల గురించి వివరించారు. ఏవైనా ఇబ్బందులు, సమస్యలు తలెత్తినపుడు 100 లేదా షీ టీమ్ వాట్సాప్ నంబర్ 8712667434, స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ 9494639498, మహిళా పోలీస్ స్టేషన్ సిద్దిపేట 8712667435 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

◆ బాధ్యతల స్వీకరణ

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల ఎస్ఐగా విజయ్‌భాస్కర్ పదవీ బాధ్యతలు బుధవారం స్వీకరించారు. ఈయన సిద్దిపేట త్రీ టౌన్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ తాండ్ర వివేక్ 15 రోజుల క్రితం బదిలీపై వెళ్లారు.

◆ సీపీని కలిసిన ఎస్ఐ

సిద్దిపేటకమాన్: అక్కన్నపేట పోలీసు స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన విజయ్‌భాస్కర్ సీపీ అనురాధను బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై రవాణా కాకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు.

సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి



జీపీపీ డిపోలో మాట్లాడుతున్న సీఐ సైదా

హుస్నాబాద్: ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేసే అతిపెద్ద ప్రజా రవాణా సంస్థ ఆర్టీసీ సంస్థ అని, ఆ సంస్థలో పనిచేసే డ్రైవర్లకు ప్రజల్లో మంచి గుర్తింపు ఉందని ఎస్సై మహేష్ అన్నారు. ఆర్టీసీ డిపోలో బుధవారం ప్రమాద రహిత వారోత్సవాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు బస్సులను చాలా జాగ్రత్తతో నడపాలని, వర్షాకాలంలో డ్రైవింగ్ ఎలా చేయాలో పలు సూచనలు చేశారు. డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రమాద రహిత వారోత్సవాలు బుధవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. బస్సు బయలుదేరే ముందు బస్సు కండిషన్, బ్రేక్స్, వైపర్లను డ్రైవర్లు చెక్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెకానిక్ సూపర్‌వైజర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు

జీరో యాక్సిడెంట్ ఇయర్‌గా..

గజ్వేల్‌రూరల్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత డ్రైవర్లపైనే ఉంటుందని గజ్వేల్ సీఐ సైదా అన్నారు. ప్రమాద రహిత వారోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల జీపీపీ(గజ్వేల్–ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఈ ఏడాది జీరో యాక్సిడెంట్ ఇయర్‌గా ఉండాలన్నారు.

ప్రమాదాలు జరగకుండా బస్సులు నడపాలి

సిద్దిపేటకమాన్: ఆర్టీసీ డ్రైవర్లు ప్రమాదాలు జరగకుండా బస్సులు నడపాలని, ప్రయాణికులను క్షేమంగా వారి గమ్య స్థానాలకు చేర్చాలని సిద్దిపేట ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం సిద్దిపేట ఆర్టీసీ డిపోలో ప్రమాద రహిత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించి బస్సులను నడపాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి, అసిస్టెంట్ డిపో మేనేజర్ మహేశ్వరీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

కోహెడ(హుస్నాబాద్): కోహెడ మండల మహిళా సమాఖ్య సమావేశం బుధవారం మండల కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కొమ్మిడి శారద, ప్రధాన కార్యదర్శిగా నాగిరెడ్డి పద్మ, కోశాధికారిగా ముంజ మంజుల, తొమ్మిది మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. మండల వ్యాప్తంగా 39 వీవో సంఘాలు ఉండగా మొదటి సారి 24 మంది అధ్యక్ష పదవికి పోటీ పడటం గమనార్హం. కార్యక్రమంలో ఐకేపీ సీసీ రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.